# హుస్నాబాద్ మున్సిపల్ 'రిజర్వేషన్' ఖరారు

## ఎస్సీ (జనరల్)కు చైర్మన్ పీఠం

## మహిళలకు సగం వార్డులు

## రోటేషన్‌తో మారిన సమీకరణాలు



హుస్నాబాద్, జనత న్యూస్: హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత కొద్దిరోజులుగా అభ్యర్థుల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ల జాబితాను ప్రభుత్వం శనివారం తుది రూపంలో ప్రకటించింది. ఈసారి అత్యంత కీలకమైన మున్సిపల్ చైర్మన్ పదవిని ఎస్సీ (జనరల్) కు కేటాయించడంతో ఆయా వర్గాల ఆశావాహుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. మొత్తం 20 వార్డులకు సంబంధించి అధికారులు ప్రకటించిన కొత్త రిజర్వేషన్లు పట్టణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా నిలుస్తున్నాయి.

### మహిళలకు అగ్రతాంబూలం

వార్డుల విభజనలో ప్రభుత్వం మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసింది. మొత్తం 20 వార్డుల్లో సరిగ్గా సగం అంటే 10 స్థానాలను మహిళలకే కేటాయించారు. ఇందులో జనరల్ మహిళకు ఆరు వార్డులు (1, 2, 3, 8, 18, 19), ఎస్సీ మహిళకు రెండు వార్డులు (10, 14), బీసీ మహిళకు రెండు వార్డులు (7, 15) దక్కాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి రిజర్వేషన్లలో భారీగా మార్పులు చోటుచేసుకోవడం గమనార్హం. రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేయడంతో పలువురు సిట్టింగ్‌ల స్థానాలు తారుమారయ్యాయి.

### వార్డుల వారీగా రిజర్వేషన్ల వివరాలు

తాజా ప్రకటన ప్రకారం వార్డుల కేటాయింపు ఇలా ఉంది. 1, 2, 3, 8, 18, 19 వార్డులను జనరల్ మహిళలకు కేటాయించగా.. 11, 12, 13, 16 వార్డులు జనరల్ (అన్-రిజర్వ్‌డ్) కేటగిరీలోకి వచ్చాయి. బీసీ జనరల్‌కు 4, 5, 20 వార్డులు, బీసీ మహిళలకు 7, 15 వార్డులను ఖరారు చేశారు. ఎస్సీ జనరల్‌కు 9, 17 వార్డులు, ఎస్సీ మహిళలకు 10, 14 వార్డులు దక్కగా.. 6వ వార్డును ఎస్టీ జనరల్‌కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

### రోటేషన్‌తో మారిన రూపురేఖలు

2020 ఎన్నికలతో పోలిస్తే ఈసారి రిజర్వేషన్లు గణనీయంగా మారాయి. రోటేషన్ విధానం అమలు చేయడంతో గతంలో రిజర్వు అయిన వార్డులు ఇప్పుడు అన్ రిజర్వ్‌డ్‌గా, అన్ రిజర్వ్‌డ్‌గా ఉన్నవి రిజర్వ్‌డ్‌గా మారాయి. ఎస్సీ విభాగంలో గతంలో ఉన్న 1, 2, 18, 19 వార్డులు ఇప్పుడు జనరల్‌లోకి వెళ్లగా.. వాటి స్థానంలో 9, 10, 14, 17 వార్డులు ఎస్సీ కేటగిరీలోకి వచ్చాయి. బీసీ విభాగంలో గతంలో ఉన్న 6, 8, 11, 12, 13 వార్డుల స్థానంలో.. ఈసారి 4, 5, 7, 15, 20 వార్డులను బీసీలకు కేటాయించారు. ఎస్టీ విభాగంలో గతంలో 14వ వార్డు ఉండగా, ఈసారి 6వ వార్డును ఆ కేటగిరీకి కేటాయించారు.

### వ్యూహాల్లో మునిగిపోయిన పార్టీలు

రిజర్వేషన్ల ప్రకటన వెలువడటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ,సిపిఐ శ్రేణులు తమ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నాయి. క్లారిటీ రావడంతో అభ్యర్థులు తమ వార్డుల పరిధిలో మంతనాలు మొదలుపెట్టారు. రిజర్వేషన్ల మార్పు కారణంగా తమ వార్డును కోల్పోయిన పలువురు సిట్టింగ్ కౌన్సిలర్లు ఇప్పుడు పక్క వార్డులపై కన్నేస్తున్నారు. చైర్మన్ పీఠం ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో, ఆ వర్గంలో బలమైన పట్టున్న నేతల కోసం పార్టీలు అన్వేషిస్తున్నాయి. గెలుపు గుర్రాలనే బరిలోకి దింపాలని అధిష్ఠానాలు భావిస్తుండటంతో టికెట్ల కోసం ఇప్పుడే పైరవీలు మొదలయ్యాయి.

# బంజరుపల్లిలో 'నిఘా' నేత్రం

### 5 సీసీ కెమెరాలను ప్రారంభించిన హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్



హుస్నాబాద్ జనత న్యూస్: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు రక్షణ కవచాల్లా పనిచేస్తాయని హుస్నాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బంజరుపల్లి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన 5 సీసీ కెమెరాలను ఎస్ఐ లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో నేరస్తులను పట్టుకోవడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. సీసీ కెమెరాల నిఘా వల్ల నేరగాళ్లలో భయం పెరుగుతుందని, ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నిందితులను త్వరితగతిన గుర్తించేందుకు పోలీసులకు ఇవి ఎంతగానో దోహదపడతాయని వివరించారు. సొంత ఖర్చుతో కెమెరాలు ఏర్పాటు చేసుకున్న బంజరుపల్లి గ్రామస్తులను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిఘా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని వ్యాఖ్యానించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ప్రవేశ మార్గాల్లో కెమెరాలు ఉండటం వల్ల 24 గంటల నిఘా సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామాల్లో కొత్తవారు లేదా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకి సర్పంచుల ఫోరం ఎన్నిక

### అధ్యక్షులుగా గూడెల్లి శ్రీకాంత్.

### ఉపాధ్యక్షులుగా పులి రమేష్ గౌడ్.



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని సర్పంచుల ఫోరం ను శనివారం మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ల, క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గూడెం సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ ను ఫోరం మండల అధ్యక్షులుగా , ఉపాధ్యక్షులుగా వడ్లూర్ గ్రామ సర్పంచ్ పులి రమేష్ గౌడ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు మండల సర్పంచులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ నియామకానికి సహకరించిన మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లకు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డిలకు మండలంలోని ప్రతి కాంగ్రెస్ నాయకులకు, మరియు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# త్రాగునీటి సమస్య తీర్చిన సర్పంచ్

### - మన్నెంపల్లి సర్పంచ్ సునీతకి స్థానికుల కృతజ్ఞతలు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీతకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మన్నెంపల్లి పరిధిలోని పొగాకుల పల్లె కు దీర్ఘకాల సమస్యగా ఉన్న త్రాగు నీటికి శాశ్వత పరిష్కారం లభించడంతో పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొగాకులపల్లి వారు ఏళ్లుగా మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో తమను గెలిపిస్తే పొగాకులపల్లికి నిత్యం తాగునీరు సరఫరా అయ్యేలా చేస్తామని హామీ ఇవ్వగా మూడు రోజులుగా పనులు చేపట్టిన సర్పంచ్ శనివారం నాటికి పూర్తి చేశారు. మంచినీటి పైప్‌లైన్‌కు తాగునీటి మోటార్ నుంచి కనెక్షన్ ఇచ్చి నిత్యం ఇంటింటికీ తాగునీరు సరఫరా అయ్యేలా చేశారు. గ్రామంలోని మంచి నీటి బావి నుంచి ఇంటింటికీ నీటిని విడుదల చేశారు. గతంలో త్రాగు నీటి సమస్య ఉండగా మినరల్ వాటర్ కొనుగోలు చేసినారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, బూడిద కిషోర్, పంచాయతీ కార్యదర్శి ఎండీ అమీర్, వార్డు సభ్యులు బొజ్జ శ్రీనివాస్, సుధగోని పరశురాములు, పోతుగంటి రమేష్, మాజీ సర్పంచ్ గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సుదగోని శ్రవణ్, దుర్గం జంపయ్య, దరిపెల్లి రమేష్, కొల్లిపాక రాజమౌళి, ఉప్పుల శ్రీనివాస్, నిమ్మనగట్టు లక్ష్మయ్య, ముంజం రమేష్, రాధారపు శ్రీనివాస్, జంగ శివ,కటుకూరి రాజయ్య, బొంతల కనకయ్య, బూడిద అనిల్, బొంతల అనిల్, పాల్గొన్నారు.

# గుగ్గిళ్ల గ్రామంలో గోపాలమిత్ర ఉచిత పశువైద్య శిబిరం



జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో, శనివారం గోపాలమిత్ర ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, ఉపసర్పంచ్ దుగ్యాని లావణ్య-మొండయ్య, పశువైద్యురాలు డాక్టర్ హరిత, గోపాలమిత్ర పర్యవేక్షకులు ఎం.డి. షాదుల్లా హాజరై, పశువైద్య శిబిరం ప్రారంభించారు. పాడి పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు ఉచిత చికిత్సలు అందించడంతో పాటు, లేగ దూడలకు నట్టల నివారణ మందులను త్రాగిపించారు. ఈ సందర్భంగా పశువైద్యులు డాక్టర్. హరిత మాట్లాడుతూ, పాడి పశువులకు పచ్చిమేత, దాణా, ఎండు మేతలను సమీకృతంగా అందిస్తూ సరైన పోషణ అందించినట్లయితే పశువులు క్రమం తప్పకుండా చూడి నిలిచి, పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొంకటి కుమార్, కొంకటి సంపత్, పంచాయితీ కార్యదర్శి కొంపెల్లి వంశీధర్, గోపాలమిత్రులు బొడిగే సత్తయ్య, వరాల లక్ష్మయ్య, నిషాని భూపతి, సంపత్ రాజిరెడ్డి, కొంకటి రాజయ్య, మైల బాలయ్య, నంగునూరి రాజయ్య, ర్యాకం సత్తయ్య, నవీన్ మరియు పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి బూత్‌ను పటిష్టం చేయండి

### జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవారెడ్డి



కరీంనగర్, జనతా న్యూస్ : ప్రతి బూత్‌ను బలోపేతం చేసే దిశగా బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవారెడ్డి సూచించారు. బూత్ నిర్మాన్ అభియాన్ కార్యక్రమం సందర్భంగా శనివారం కొత్తపల్లిలో మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వాసుదేవారెడ్డి మాట్లాడుతూ, జాతీయ పార్టీ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు ప్రతి బూత్‌లో 12 మందితో కమిటీ ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రతి బూత్‌కు బిఎల్ఏ--2ను తప్పనిసరిగా నియమించాలని, ఇప్పటికే కమిటీలు ఏర్పాటైన చోట వాటిని పునఃపరిశీలన చేయాలని మండల అధ్యక్షులకు సూచించారు. ప్రతి బూత్‌లో ఆరు కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని, ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు బూత్ నిర్మాన్ అభియాన్‌ను పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, ఉపసర్పంచ్ అందె శేఖర్, బీజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఎర్రోజు లక్ష్మణ్, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్, మండల కార్యదర్శి పడాల శ్రీనివాస్, కోశాధికారి పిస్క క్రిష్ణకిశోర్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, కానుగంటి మధుకర్ రెడ్డి, దళిత మోర్చా ఉపాధ్యక్షులు ఉప్పులేటి జీవన్, జంగ సునీల్ రెడ్డి, బూత్ అధ్యక్షులు రామిడి మహేం దర్ రెడ్డి, సతీష్, కామెర వెంకటేష్, మహేష్, ప్రవీణ్, సుగుణాకర్, శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

# విద్యార్థులకు 'అరైవ్ అలైవ్ అవగాహన పోటీలు

### ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బహుమతుల ప్రధానోత్సవం



కరీంనగర్, జనతా న్యూస్ : ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంపొందించి, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం గురించి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లాఖాన్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతపై చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు వ్యాసరచన మరియు రంగోలి (ముగ్గుల) పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలను ప్రతిబింబించే అంశాలతో ఈ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలను ఎంపిక చేసి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించడంతో పాటు, తమ తల్లిదండ్రులు మరియు ఇరుగుపొరుగు వారికి కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. 'అరైవ్ అలైవ్ణ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించడమే పోలీసుల లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి పాటుపడతా

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**



కరీంనగర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండలం అల్గునూర్ గ్రామంలోని శ్రీ గంగమ్మ--కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఎస్డీఎఫ్ నిధుల కింద రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన గంగమ్మ--కట్ట మైసమ్మ ఆలయ ప్రహరీ గోడను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. గ్రామ ప్రజలు కూడా ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామానికి సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి ప్రయత్నిస్తానని, గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ--కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్ గోదుమ వెంకన్న, ధర్మకర్తలు పాశం బాలయ్య, వెంకర్ల నగేష్, జి.కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ ఎంపీపీ శ్రీగిరి రంగారావు, పార్టీ జిల్లా కార్యాలయ ఇంచార్జీ గోపు మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి, కంది అశోక్ రెడ్డి, కాలువ మల్లేశం, కాత కొమురయ్య, చిందం కిష్టయ్య, దాసరి నాగేందర్, ముంజ శ్రీకాంత్, పాశం కిరణ్, ఐతం మహేశ్, నర్సింగాపూర్ సర్పంచ్ పెరుక రవీందర్, మహాత్మానగర్ సర్పంచ్ సంపత్, ఉపసర్పంచ్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

**నగరపాలక సంస్థపై గులాబీ జెండా ఎగరవేస్తాం : గంగుల కమలాకర్**



కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ నగరంలోని 42వ డివిజన్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంద్ర రఘునాథరావు శనివారం భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం గంగుల కమలాకర్ నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఘన విజయం సాధించి మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ లిస్టులు, రిజర్వేషన్ల విషయంలో జరిగిన అవకతవకలను నిలదీసి సరిచేయించామని, ఇవి బిఆర్ఎస్ సాధించిన విజయాలుగా పేర్కొన్నారు. మేయర్ పదవిని బీసీలకు కేటాయించడం ద్వారా బీసీలంతా ఐక్యంగా గులాబీ జెండాను నగరపాలక సంస్థపై ఎగరవేస్తామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై విమర్శలు గుప్పించిన ఆయన, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో నిలిచిందని గుర్తు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్‌కు వేల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశామని తెలిపారు.ల ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్ రావు, దిండిగాల మహేష్, గందె మహేష్, బోనాల శ్రీకాంత్, వాల రమణారావు, ఎడ్ల అశోక్, నాయకులు సుంకిశాల సంపత్ రావు, జువ్వాడి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



చిగురుమామిడి, జనత న్యూస్: మండలంలోని ముల్కనూర్ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆరో తరగతిలో చేరేందుకు, అలాగే 7 నుంచి 10 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ ప్రవేశాల కోసం ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు రుసుము కింద ఓసీ విద్యార్థులు 200 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులు 125 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏప్రిల్ 9వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 19వ తేదీన నిర్వహించనున్నట్లు వివరించారు. ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ http://tgms.telangana.gov.in/ ను సందర్శించాలని ప్రిన్సిపల్ కోరారు.

# లాటరీ పద్ధతిలో మహిళా రిజర్వేషన్ వార్డుల ఖరారు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ పమేలా సత్పతి**




కరీంనగర్, జనతా న్యూస్ : జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు మరియు కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మహిళలకు కేటాయించాల్సిన రిజర్వేషన్ వార్డులను లాటరీ పద్ధతిలో ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ వార్డులలో మహిళా రిజర్వేషన్ ఖరారు చేసే ప్రక్రియను శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మున్సిపల్ వార్డులలో మహిళలకు రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా లాటరీ విధానంలో పూర్తి చేసినట్లు తెలిపారు. చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలు అలాగే కరీంనగర్ కార్పొరేషన్‌కు సంబంధించిన వార్డుల వారీగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్ వర్గాల మహిళలకు కేటాయించిన రిజర్వేషన్ వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫోల్ దేశాయ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ--బిఆర్ఎస్ పాలనలో నగర అభివృద్ధి శూన్యం

**అవినీతి కవలలుగా ప్రజల కష్టాన్ని దోచుకున్నారు : మేడిపల్లి సత్యం**



కరీంనగర్, జనతా న్యూస్ ఎ జనవరి 17 : బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు అవినీతి కవలలుగా మారి నగర ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్నాయని కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీవ్ర ఆరోపణలు చేశారు. శుక్రవారం కరీంనగర్ ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో చైర్మన్, మేయర్ రిజర్వేషన్లు ప్రకటించారని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో 90 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ ప్రత్యక్ష పార్టీ గుర్తు లేకపోయినా కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థులకు 70 శాతానికి పైగా ప్రజల మద్దతు లభించిందని పేర్కొన్నారు. కరీంనగర్ నగరంలో గత పదేళ్లుగా బీజేపీ, బిఆర్ఎస్ పాలనలో పర్సంటేజీ కల్చర్ రాజ్యమేలిందని, అభివృద్ధి కంటే అవినీతికే పెద్దపీట వేసినట్లు విమర్శించారు. స్మార్ట్ సిటీ పనులు, కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందని, ఇంటింటికి తాగునీరు హామీ అమలుకాలేదని ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలు మరో అవతారంలో బీజేపీలోకి వెళ్తున్నారని, అవినీతి రూపం మారుతుంది తప్ప అవినీతి మారడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. నగరాభివృద్ధి కోసం ఒక అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఇవ్వాలని కరీంనగర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# 48వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

**కార్పొరేషన్ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలి : వైద్యుల అంజన్ కుమార్**



కరీంనగర్, జనతా న్యూస్ ఎ జనవరి 17 : కరీంనగర్ నగరంలోని విద్యానగర్ 48వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేకల నరసయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకులు మునిగంటి అనిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కరీంనగర్ కార్పొరేషన్ అర్బన్ డీసీసీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో జరగనున్న కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో 48వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదంతో నగర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్రా రాజశేఖర్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజ్ ఉద్దీన్, బీసీ సెల్ టౌన్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

హుస్నాబాద్, జనత న్యూస్: తమకు రావాల్సిన పదవీ విరమణ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట శనివారం రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న సెటిల్‌మెంట్ నిధుల కోసం ఎదురుచూస్తున్నామని, యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిపో మేనేజర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ.. సంస్థ కోసం దశాబ్దాల



కాలం శ్రమించినా, రిటైర్మెంట్ తర్వాత రావాల్సిన సొమ్ము అందకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నామని వాపోయారు. పిల్లల చదువులు, వివాహాలు, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాల రీత్యా అప్పులు చేయాల్సి వచ్చిందని, ఇప్పుడు ఆ అప్పులకు వడ్డీలు చెల్లించలేక మానసిక వేదన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, తమ కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీసీలు ప్రభాకర్, ఎం.పి. రెడ్డి, రాధాకృష్ణతో పాటు డ్రైవర్లు రాములు, రాజిరెడ్డి, కనకయ్య, శంకర్, కనకరాజు, ఆంజనేయులు, సత్తయ్య, మైసయ్య, వి.జె. రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com